sahanamvande.com
epaper.sahanamvande.com
# సహనం వందే
హైదరాబాద్ | 14-10-2025 మంగళవారం | సంపుటి-1 సంచిక : 205 EDITOR: ROHINI






# తెలంగాణ కలెక్టర్... ఏపీ మంత్రికి కనెక్ట్

## ఒక్క ఫోన్‌తో పని చేసిపెట్టిన ఉన్నతాధికారి

తెలంగాణలో మంత్రుల ఆదేశాలను పట్టించుకోకుండా అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక జిల్లాలో జరిగిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా అధికారుల వైఖరిపై తీవ్ర చర్చకు దారితీసింది. సినీ పరిశ్రమకు చెందిన ఒక వ్యక్తి తన భూమి వివరాలు సరిచేయడానికి ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఎన్ని రోజులు గడిచినా సొంత మంత్రి ఆదేశించినా స్పందించని కలెక్టర్... చివరకు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ మంత్రి చేసిన ఒక్క ఫోన్ కాల్‌తో వెంటనే పని పూర్తి చేయడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ ఘటన రాష్ట్రంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న అంతరాలను, అధికార దుర్వినియోగాన్ని బహిర్గతం చేసింది. తెలంగాణ మంత్రుల మాటలు పనిచేయని చోట, రాష్ట్ర సరిహద్దు దాటి వచ్చిన ఆదేశానికి కలెక్టర్ ఉత్సాహం చూపడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- సహనం వందే, హైదరాబాద్


### అదే పనిచెప్పిన రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి బేఖాతర్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక కలెక్టర్ తీరు
- ఏపీ మంత్రి చెప్పారని పనిచేసిన అధికారి
- కొందరు ఐఏఎస్ అధికారులపై మంత్రుల గరం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం ధరణి పోర్టల్‌పై ఉన్న వివాదాలను మరింత పెంచింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన ఈ పోర్టల్ భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి ఉద్దేశించినా దరఖాస్తుల ఆలస్యం, అవినీతి ఆరోపణలు, తప్పులతో గతంలోనూ రైతులు, పౌరులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధరణి పేరును భూమాతగా మార్చామని ప్రకటించినా క్షేత్ర స్థాయిలో సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సొంత మంత్రి ఆదేశించినా స్పందించని కలెక్టర్... ఏపీ మంత్రి ఫోన్ రాగానే హుటాహుటిన పని పూర్తి చేయడం కొందరు ఐఏఎస్ అధికారుల అహంకారాన్ని, అలాగే తెలంగాణ మంత్రుల పట్టు లేమిని ఎత్తి చూపుతోంది. తెలంగాణ మంత్రులు చెప్పినప్పుడు అడ్డు వచ్చిన నిబంధనలు, ఏపీ మంత్రి ఫోన్‌తో అడ్డు రాలేదా అని కొందరు కలెక్టర్ల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

#### ఏపీ ప్రజా ప్రతినిధుల పట్టు...


అధికారుల నిర్లక్ష్యం వల్ల సాధారణ ప్రజల పనులు పెండింగ్‌లో పడటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ కలెక్టర్ పేషీలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ వెంటనే పరిష్కరించాలని, లేదంటే తమకు కూడా ఏపీ మంత్రితో ఫోన్ చేయించండంటూ ప్రజలు డిమాండ్ చేయడం అక్కడ పరిస్థితి ఎంత గందరగోళంగా ఉందో తెలియజేస్తోంది. అంతేకాదు అనేకమంది ఆంధ్రప్రదేశ్కు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఇతర నాయకులు తెలంగాణలో తమ ప్రాబల్యాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. హైదరాబాదులో తిష్ట వేసి పనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఐఏఎస్ స్థాయి అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అధికారులను నియంత్రించి, ధరణి సహా పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే ఈ హాట్ టాపిక్ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉంది.




# ఆర్ఎస్ఎస్‌పై కేరళ టెక్కీ సూసైడ్ బాంబ్

## లైంగిక వేధింపులకు గురయ్యానంటూ నోట్

- రాజకీయస్త్రంగా మలుచుకున్న కాంగ్రెస్ పార్టీ
- బీజేపీని ఇరుకున పెట్టిన ప్రియాంక గాంధీ
- సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్
- జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం
- ఆత్మరక్షణలో ఆర్ఎస్ఎస్, కాషాయం పార్టీ



ఆత్మహత్య చేసుకున్న అనందు అజి

కేరళకు చెందిన ఒక ఐటీ ఇంజనీర్ అనందు అజి ఆత్మహత్య దేశ రాజకీయాలను ముఖ్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మూలాలను కుదిపేస్తోంది. అనందు రాసిన 15 పేజీల సూసైడ్ నోట్ బయటపడటంతో ఇది కేవలం మానసిక ఆరోగ్య సమస్యగా కాకుండా ఒక సంస్థాగత విషాదంగా మారింది. బాల్యంలో ఆర్ఎస్ఎస్ శిబిరాల్లో, సభ్యుల చేతుల్లో తాను లైంగిక, శారీరక వేధింపులకు గురయ్యానని, తన శరీరాన్ని ఆటవస్తువుగా ఉపయోగించుకున్నారని, బ్యాటన్‌లతో కొట్టేవారని ఆ యువకుడు ఆరోపించడంతో దేశ రాజకీయాల్లో తీవ్రమైన చర్చ మొదలైంది. ఈ దారుణాలు తన ఓసీడీ, డిప్రెషన్‌కు కారణమయ్యాయని అతడు పేర్కొన్నాడు. - సహనం వందే, న్యూఢిల్లీ

ఈ సంచలన ఆరోపణలను కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయాస్త్రంగా మలచ డంలో ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. ఆర్ఎస్ఎస్ శిబిరాల్లో అనందు లాంటి వేలాది మంది పిల్లలు, యువకులు ప్రమాదంలో ఉన్నారని ఆమె సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా హెచ్చరిం చారు. లైంగిక వేధింపులు అక్కడ విస్తృతంగా జరుగుతున్నాయని, ఈ ఆరోపణలు నిజమైతే దేశాన్ని వణికించే భయంకరమైన విషయమని ఆమె ఆరోపించారు. కేవలం అనందు మాత్రమే కాదని అనేక మంది బాధితులు ఉన్నారని ఆమె పేర్కొనడం ఈ అంశానికి జాతీయస్థాయిలో తీవ్రతను పెంచింది. ఆర్ఎస్ఎస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని, కేరళ టెక్కీ మరణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆమె డిమాండ్ చేయడం కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి ఆర్ఎస్ఎస్ పై జరిగిన మొదటి పదునైన రాజకీయ దాడిగా విశ్లేషకులు భావిస్తున్నారు.




#### బీజేపీకి ఆర్ఎస్ఎస్ వెన్నెముక...



అనందు అజి చేసిన అత్యంత తీవ్రమైన బాలల లైంగిక వేధింపుల ఆరోపణలపై ఆర్ఎస్ఎస్ ఇప్పటికీ అధికారికంగా స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సున్నితమైన ఈ అంశంపై సంస్థ మౌనం వహించడం ఆరోపణలు నిజమేనేమోననే భావనను మరింత బలపరుస్తోంది. ఆర్ఎస్ఎస్ అనేది అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి వెన్నెముకగా నిలుస్తున్న సంస్థ. అలాంటి సంస్థ అంతర్గత సమస్యలపై, ముఖ్యంగా పిల్లల భద్రతకు సంబంధించిన విషయాలపై నిర్లక్ష్యంగా ఉండటం ఏ మాత్రం సమంజసం కాదు. ఈ మౌనం ఆర్ఎస్ఎస్ లోని వ్యవస్థాగత లోపాలను బహిర్గతం చేస్తోంది. బీజేపీ పాలనలో ఉండి కూడా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించకపోవడం పాలకుల చిత్తశుద్ధిని నేరుగా ప్రశ్నిస్తోంది.

# జెన్ జెడ్ మంటల్లో మడ్‌గాస్కర్ అధ్యక్షుడు

## ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఫ్రాన్స్‌కు పరారు

- నేపాల్‌లో మొదలైన ఉద్యమం విశ్వవ్యాప్తి
- ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, పెరూ, కెన్యాల్లోనూ
- అవినీతి, పేదరికంపై డిజిటల్ తిరుగుబాటు
- కోట్ల విలువైన ఖనిజాలున్నా పేదరికంలో జనం

జెన్ జెడ్ తిరుగుబాటుతో మడ్ గాస్కర్ అధ్యక్షుడు అండ్రీ రాజోయెలినా దేశం విడిచి పారిపోవడం ప్రపంచ రాజకీయాలను ఉలికిపాటుకు గురి చేస్తున్నాయి. వేలాది మంది యువకులు అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు ఉద్ధృతం చేయడంతో ఆర్మీ కూడా సహకరించింది. సైన్యం మద్దతు కోల్పోయిన రాజోయెలినా రహస్యంగా దేశం వదిలి వెళ్లిపోయాడు. రాజోయెలినా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో ఒప్పందం చేసుకుని ఫ్రెంచ్ సైనిక విమానంలో పారిపోవడం గమనార్హం. దీంతో ఆ దేశంలో తాత్కాలికంగా సెనేట్ అధ్యక్షుడు జీన్ ఆండ్రే ఎన్‌డ్రెమంజరీ పాలన ప్రారంభమైంది.

- సహనం వందే, మడ్ గాస్కర్


మడ్ గాస్కర్ అధ్యక్షుడు అండ్రీ రాజోయెలినా

సెప్టెంబర్ 25న మొదలైన ఈ ఉద్యమం కేవలం విద్యుత్, నీటి కొరతల నుంచి అకస్మికంగా అవినీతి, పాలనా వైఫల్యాలు, పేదరికంపై పోరాటంగా మారింది. మడ్ గాస్కర్ లో మూడు కోట్ల మంది జనాభాలో 75 శాతం మంది పేదలు ఉన్నారు. యువతలో నిరుద్యోగం, ఆకలి మంటలు ఈ తిరుగుబాటుకు ప్రధాన ఆయుధమయ్యాయి. 13 ఏళ్ల పాలనలో ఈ ప్రభుత్వం తమవారిని ధనవంతులను చేసుకుంటూ ప్రజలను పేదలుగా మార్చిందని యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 1960లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జీడీపీ 45 శాతం పడిపోవడం... వెనిలా, నికెల్, కోబాల్ట్ వంటి ఖనిజాల ద్వారా ఆదాయం వచ్చినా ప్రజలకు చేరకపోవడంతో యువత రోడ్లపైకి వచ్చింది. ఈ పోరాటంలో 22 మంది మరణించినా... యువత వెనక్కి తగ్గకుండా పోరాడి అధ్యక్షుడిని దింపేసింది.

#### జెన్ జెడ్ తిరుగుబాట్లు...

మడ్ గాస్కర్‌లో మొదలైన ఈ జెన్ జెడ్ తిరుగుబాటు ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలకు ఊపిరి పోస్తోంది. ఇంతకుముందు నేపాల్‌లో ప్రధానమంత్రి రాజీనామాకు దారితీసిన ఆందోళనలు... మొరాకోలో ప్రజాగ్రహం వంటి సంఘటనలతో ఈ జెన్ జెడ్ తరం ఉద్యమాలు ముడిపడి ఉన్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సమన్వయం చేసుకుంటూ స్థానిక నాయకత్వం లేకుండానే ఈ తిరుగుబాట్లు బలంగా తయారవుతున్నాయి. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, పెరూ, కెన్యా వంటి దేశాల్లో కూడా యువత అవినీతి, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతోంది. మడ్ గాస్కర్ తిరుగుబాటు ప్రపంచ రాజకీయాల్లో యువత శక్తిని, డిజిటల్ తిరుగుబాటు సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేసింది.



